క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

తొండూరు: తొండూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నారాయణమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విష్ణుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేంపల్లె: స్థానిక వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతిజ్ఞను విద్యార్థులచే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు జనార్ధన్, వినోద్ కుమార్, తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు


పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

పెండ్లిమర్రి: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను మంగళవారం తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదులు, లైబ్రరీ, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారు బాలల సంరక్షణ కొరకు చేపట్టిన న్యాయ సేవా పథకం 2015 గురించి వివరించారు. సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి


ఎస్సై తులసి నాగప్రసాద్

సింహాద్రిపురం: శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సింహాద్రిపురం ఎస్సై తులసి నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎస్సైగా తులసి ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు.

నిర్మాణ పనులు కొనసాగించాలి

వేంపల్లె: పట్టణంలో ఆగిపోయిన ప్రధాన రహదారులు, అండర్ డ్రైనేజీ పనులు కొనసాగించాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మంగళవారం ఆయన సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.30 కోట్లతో టెండర్లు పిలిచి కడప రోడ్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు, అలాగే గండిరోడ్డులో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.10 కోట్ల పనులు జరిగాయని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్మాణ పనులు ఆగిపోయాయని, అసంపూర్తి పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టి తెచ్చామని చెప్పారు.

విద్యా సామగ్రి వితరణ


విద్యా సామగ్రిని అందజేస్తున్న ఎంఈఓ శివప్రసాద్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలోని విద్యార్థులకు ఆర్‌డీడబ్ల్యూ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు లీలావతమ్మ, సుశీల, జాన్ పేద విద్యార్థులకు రూ.10 వేలు విలువల విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. మంగళవారం వీటిని ఎంఈఓ శివప్రసాద్, హెచ్ఎం సుబ్బిరెడ్డి, విద్యార్థులకు అందజేశారు.

ఎంపీడీఓగా లోకేశ్వరరావు

లింగాల: లింగాల ఇన్‌చార్జి ఎంపీడీఓగా లోకేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. లింగాల మండలానికి ఎంపీడీఓ లేకపోవడంతో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న లోకేశ్వరరావును ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన జెడ్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

కూలీల కొరత.. కర్షకుల వెత

ఖరీఫ్ సీజన్ మొదలయినప్పటికీ.. వరుణుడు కరుణ చూపడం లేదు. ఎండలకు భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. అయినప్పటికీ ఆకాశం వైపు ఆశగా చూస్తూ.. వర్షాలకు పడకపోతాయా.. పంటలు పండకపోతాయన్న చిన్న ఆశతో అన్నదాతలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. స్థానికంగా దొరకక భారమైనా.. అధిక మొత్తంలో కూలీ డబ్బులు చెల్లించి వలస కూలీలతో పనులు చేయించుకుంటున్నారు. కూలీల రేట్లు, సాగు పెట్టుబడి పెరిగి కర్షకులు ఇబ్బంది పడుతున్నారు.


మిరపకాయలు కోస్తున్న కూలీలు

- గ్రామాల్లో ఊపందుకున్న వ్యవసాయ పనులు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- ఇతర ప్రాంతాల నుంచి కూలీల దిగుమతి

వేముల: గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ సంవత్సరం వ్యవసాయ బోర్లు, బావుల కింద పత్తి, మిరప, వేరుశెనగ, ఉల్లి పంటలు విస్తారంగా సాగయ్యాయి. పులివెందుల నియోజకవర్గంలో 25 వేల ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో 13 వేల ఎకరాల్లో పత్తి, 3,500 ఎకరాల్లో ఉల్లి, 4 వేల ఎకరాల్లో వేరుశెనగ, 2,500 ఎకరాల్లో మిరప పంటలు సాగయ్యాయి. వ్యవసాయ పనులలో రైతులు కూడా బిజీగా ఉన్నారు. పనులకు కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో ఎక్కడికక్కడ పనులు ఉండడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఆయా గ్రామాల్లో కూలీలు దొరకక బయట ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చుకుని రైతులు పనులు చేయించుకుంటున్నారు. బోర్లు, బావుల కింద పంటలు విస్తారంగా సాగుచేయడం, ఒకే అదునులో సాగుకావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది. ఆయా గ్రామాల్లోని తోటలలో మిరప కోత పనులు, పత్తితీసే పనులు, ఉల్లిలో కలుపుతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి.

కూలీల కోసం వెంపర్లాట

ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో పనులు చేయించుకునేందుకు కూలీల కోసం రైతులు వెంపర్లాడుతున్నారు. పత్తితోటలలో పత్తి దిగుబడులు తీసేందుకు కూలీలు చిక్కడం లేదు. వర్షాలతో తోటలలో ఉన్న పత్తి దెబ్బతింటుందన్న ఉద్దేశంతో రైతులు బయట కూలీలను ఆశ్రయిస్తున్నారు. అలాగే ఉల్లి, వేరుశెనగ పంటలలో కలుపు ఎక్కువగా ఉండడంతో వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతింటాయని కలుపు తీయించేందుకు కూలీల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఒకేసారి పనులు ఊపందుకోవడంతో కూలీల కొరత ఎక్కువగా ఉంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రూ.400లు కూలీ, ఆటో బాడుగలు ఇచ్చినా కూలీలు దొరకని పరిస్థితి ఉంది. సాగులో దిగుబడులు ఉండి ధరలు ఆశాజనకంగా ఉంటాయనే ఉద్దేశంతో రైతులు కూలీల ఖర్చుకు వెనుకాడడం లేదు.

ఆందోళనలో రైతన్న

రోజు కూలీ రూ.400లు ఇస్తున్నా కూలీలు దొరకడం లేదని, పనులు ఎక్కువగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. చేతికి అందివచ్చిన దిగుబడులు దెబ్బతింటే నష్టపోతామని కూలి ఎక్కువ ఇచ్చేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత 10 రోజులుగా గ్రామాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఇదే పరిస్థితి ఒక నెలరోజుల పాటు ఉంటుందని, కూలీలకు వారం రోజులు ముందే చెప్పడంతో ముందు చెప్పిన వారికి పనులకు వెళ్లడంతో సకాలంలో పనులు సాగడం లేదని రైతులు అంటున్నారు. కూలీలకు డిమాండ్ ఉండడం, పనులలో కుంటు పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పెట్టుబడి ఖర్చు కూడా పెరుగుతోందని, సకాలంలో వర్షాలు కురిస్తే లాభాలు వస్తుందని, లేకుంటే పెట్టుబడి కూడా దక్కదని కర్షకులు కలత చెందుతున్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థుల

పులివెందుల టౌన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో విద్యార్థులు హర్ ఘర్ తిరంగా అంటూ ప్రచార ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల వద్ద నుంచి శ్రీరామాహాల్ రోడ్డు, మెయిన్ బజార్, పూలఅంగళ్ల సర్కిల్ వరకు స్వతంత్ర భారత్ కీ జై అంటూ నినాదాలు చేశారు.. ప్రతి భారతీయుడు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర, డా.బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓలు డా.శ్రీనిత, శ్రీనివాసులరెడ్డి, సుగుణ, విజయలక్ష్మి, రాధిక, రెడ్డమ్మ, హేమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాగలగుట్టపల్లెలో..

చక్రాయపేట: మండలంలోని నాగలగుట్టపల్లెలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నాగలగుట్టపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలసి ఎన్‌డీఏ కూటమి సభ్యులు ఈ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. వందేమాతరం, భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దశరథ, ప్రధానోపాధ్యాయుడు సంజీవకుమార్ ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

పుష్పగిరి గుట్టపై లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళిక


పుష్పగిరి గుట్టపై పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి గుట్టపై లక్ష మొక్కలు నాటే దిశగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాల మేరకు సామాజిక అటవీశాఖ డీఎఫ్ఓ ఎం.నాగార్జునరెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ జి.నాగేశ్వర రెడ్డి, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు అనంతబొట్ల వెంకటసుబ్బయ్య, అటవీశాఖ రిటైర్డు డిప్యూటీ కన్సర్వేటర్ ఎస్.శ్రీనివాస్ తదితరులు గుట్టపై మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఎక్కడెక్కడ మొక్కలు నాటాలి, ఎంత దూరం వదలాలి, నీటి లభ్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంస్థలు కలిసి రావడం అభినందనీయమన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఇవ్వాలి

వేంపల్లె: జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్‌లుగా ప్రమోషన్లు ఇవ్వాలని జూనియర్ లెక్చరర్ ప్రమోషన్ పోరాట వేదిక రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ పురుషోత్తమచారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మంగళగిరిలో తమ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న జేఎల్ పోస్టుల్లో 50 శాతం నియామక ప్రక్రియ, 10శాతం పోస్టులు వివిధ శాఖలోని బోధనేతర సిబ్బంది ద్వారా భర్తీ చేస్తున్నారు. కానీ మిగిలిన 40శాతం వాటాను స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని మంత్రిని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధి చెరుకూరు శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ రవికుమార్, రామదాసు, శ్రీరాములు, శ్రీనివాసులు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎర్రగుంట్ల: యర్రగుంట్ల పట్టణం పరిధిలోని ప్రకాశ్ నగర్ కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న స్థానికుడు శివ మేకలను తప్పించబోయి ఎదురుగా నడచి వస్తున్న జయరాముడును ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

52 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

దువ్వూరు: దువ్వూరు–ప్రొద్దుటూరు రోడ్డులోణ/నేలటూరుమెట్ట వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 52 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి దువ్వూరుకు చెందిన నరసింహులు, గిరిలను అరెస్టు చేశామన్నారు.

రేషన్‌షాప్ కమీషన్ డబ్బులు ఇవ్వాలి

జమ్మలమడుగు రూరల్: చౌక దుకాణం నిర్వహణకు సంబంధించి తనకు రావాల్సిన కమీషన్ డబ్బులను ఇవ్వాలని తానీషా వలి అనే వ్యక్తి తహసీల్దార్ పి.శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశాడు. పట్టణంలోని దొరసాని వీధిలో చౌక దుకాణం షాపు నిర్వహిస్తున్న ఒంటెల హబీబున్ అనే మహిళ చౌకదుకాణం నిర్వహించేది. ఈ దుకాణాన్ని మరొకరికి కేటాయించడంతో ఆమె భర్త తానీషా వలి జూలై మాసంలో తన వద్ద ఉన్న ఈ పాస్, కాటా అధికారులకు ఇచ్చాడు. అయితే తనకు రావాల్సిన కమీషన్ డబ్బులను మంజూరు చేయాలని ఆయన కోరాడు.

సూక్ష్మ ధాతు లోపాల నివారణకు చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె: ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి పంటలో సూక్ష్మధాతు లోపాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొమ్మద్ది, వెల్లర్తి గ్రామాల్లో సాగులో ఉన్న పత్తి పంటను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి పంటలో మెగ్నీషియం, బోరాన్ లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణ చర్యల గురించి రైతులకు వివరించినట్లు తెలిపారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

జమ్మలమడుగు రూరల్: ఈ నెల 16 నుంచి జమ్మలమడుగు మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ పి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ 29 వరకు ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలి



జమ్మలమడుగు: కుర్చీలాట ఆడుతున్న ఉద్యోగులు, కమలాపురం: స్వాతంత్య్ర సమర యోధుల చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జమ్మలమడుగు: ఎందరో గొప్పవారి పోరాటం ఫలితంగా వచ్చిన స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమైన ఉద్యోగులకు ఆహ్లాదం కోసం ఇలాంటి పోటీలను నిర్వహించడం వలన మరింత ఉత్సాహం కలుగుతుందన్నారు.అనంతరం మహిళలకు తాగులాగుడు ఆట, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ ఆటలను, మగవారికి క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆగస్టు 15న బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజరు విజయభారతి, డీఈ బాలమల్లేష్, ఆర్ఓ రాంబాబు, ఆర్ఐ రవిబాబు, శ్రీనివాసులు గంగులయ్య, రసూలమ్మ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమర యోధులను స్మరించుకోవాలి

కమలాపురం: స్వాతంత్య్ర పోరాట సమర యోధులను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ పుల్లారెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో 78వ భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత జాతీయోద్యమ ఘట్టాలు, స్వాతంత్య్ర పోరాట సమర యోధుల చిత్ర ప్రదర్శన (ఫోటో ఎగ్జిబిషన్)ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ విద్యార్థులు కష్టపడి చదివి దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి హెచ్చరిక


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు

పులివెందుల టౌన్: ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర రెడ్డి, నూరుబాషా కార్పొరేషన్ మాజీ చైర్మన్ రసూల్ హెచ్చరించారు. పులివెందుల హౌసింగ్‌లో అవినీతి జరిగిందని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మంగళవారం స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేవలం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నమో.. లేక వారి అవగాహన రాహిత్యంతో చేసిన ఆరోపణలు, నివేదికలతో వేలమంది పేదలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు, మున్సిపల్ కార్మికులు, చిరుద్యోగులు అంగన్వాడీ, ఆశావర్కర్లకు గత జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెసలుబాటు కల్పించి వారికి గృహాలు కల్పిస్తే ఇప్పుడు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా సాకు చూపుతూ వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచి మొన్నటి వరకు పులివెందులలో మంజూరైన టిడ్కో గృహాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పులివెందులలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. బాధితుల తరఫున పోరాడుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు ఖాదర్ బాషా, డేనియల్, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పందులను తరలించండి


పందుల పెంపకం దారులతో మాట్లాడుతున్న సీఐ, మున్సిపల్ కమిషనర్

ఎర్రగుంట్ల : పట్టణంలో పందుల సమస్య ఎక్కువ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు, కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. పట్టణంలో ఉన్న పందులన్నింటిని ఈ నెల 30వ తేదీలోగా తరలించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని సీఐ, కమిషనర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణ పరిధిలోని పందుల పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పందుల పెంపకం దారులకు ఊరికి దూరంగా పందులను ఉంచాలని హెచ్చరికలు జారీ చేశారు. లేకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే పందులను వేరే ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు.

మొక్కల వితరణ

యర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యర్రగుంట్ల మున్సిపాలిటీకి 302 మొక్కలు వితరణ చేశారని మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణయ్య తెలిపారు. మంగళవారం ఈ మొక్కలను మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మావనత స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు రఘురామిరెడ్డి, డాక్టర్ రామాంజనేయరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రాజారెడ్డి, రామశేఖర్ రెడ్డి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టి గణపతే.. మహా గణపతి


కళాజాత నిర్వహిస్తున్న బృంద సభ్యులు

కమలాపురం: పర్యావరణ హితం కోసం మట్టి వినాయకుడి ప్రతిమలు పూజించాలని కళాజాత బృంద సభ్యుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం కమలాపురం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాత నిర్వహించారు. పట్టణంలో జన సంచారం అధికంగా ఉన్న పలు చోట్ల కళాజాత నిర్వహించి ఆట పాటల ద్వారా పర్యావరణాన్ని మనమే రక్షించుకోవాలని, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి వినాయ చవితి రోజు మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే పూజించాలని కోరారు. పీఓపీతో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తే అవి నీటిలో కరగక పోవడంతో పాటు నీటిని కాలుష్యం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.శ్రీనివాసులు, ఏఈ అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


జీవామృతం తయారీని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగలక్ష్మి

పులివెందుల రూరల్: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని వ్యవసాయ అధికారి నాగలక్ష్మి అన్నారు. పులివెందుల మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయితీలో సేంద్రియ పద్ధతి సాగు చేసిన పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన అరటి, టమాటా పంటలను పరిశీలించారు. రైతులు జీవామృతం వాడడం వలన రసాయనాల ఖర్చు తగ్గి భూమి సారవంతమై పంటలు బాగా పండుతాయని పేర్కొన్నారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన ఉత్పత్తులను మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. వ్యవసాయశాఖ నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకోవాలి

కమలాపురం: ప్రతి పంచాయతీని అభివృద్ధి పథంలో నిలిపి ఆదాయం పెంచుకోవాలని మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పాచికలపాడులో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన స్వచ్ఛభారత్ షెడ్‌పై అవగాహన కల్పించారు. షెడ్ నిర్వహణ, వ్యర్థ పదార్థాల నుంచి సంపద ఏలా సృష్టించుకోవాలి అనే అంశాలపై టీఓటీలు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. శిక్షణలో పొందిన అంశాలను పాటించి సమిష్టి కృషితో పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత కూడా సర్పంచులు, కార్యదర్శులపైనే ఉందని స్పష్టం చేశారు. ఎంపీడీఓ జ్యోతి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకుందాం

జమ్మలమడుగు: వయనాడ్ బాధితులను మానవత్వంగా ఆదుకుందామని సీపీఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వివిధ జూనియర్ కాలేజిలో వెళ్లి విద్యార్థులు, ఉద్యోగుల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు వయనాడ్ ప్రాంతం నీట మునిగిందని, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా భావించి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వినయ్‌కుమార్ హాజి, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మహాసంప్రోక్షణకు అంకురార్పణ నేడే

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న చక్రసహిత శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో 14 నుంచి 16వ తేదీ వరకు మహాసంప్రోక్షణ, 12వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 14న గణపతి పూజ, స్వస్తివాచన, కలశస్థాపనలతో పాటు అగ్ని ప్రతిష్ఠ మహాగణపతి హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. 15వ తేదీన పుణ్యనదీజలాల పంచగవ్య, మహాస్నపనం, అష్టోత్తర కలశాభిషేకం, శ్రీమన్నారాయణ మహాలక్ష్మిల సుదర్శన హోమం నిర్వహించనున్నారు. 16న శ్రీచక్ర యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, శ్రీ మహాలక్ష్మి, సరస్వతి, దుర్గ, లలిత హోమాలు నిర్వహించి 108 రకాల సుగంధ ద్రవ్యాలు, పూలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తామన్నారు.భక్తులు కార్యక్రమాలనువిజయవంతం చేయాలని కోరారు.

నిందితుడు అరెస్ట్

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఆవరణంలో తిరుపతికి చెందిన వెంకటేష్ ఆటోను పార్క్ చేసి తమ పేషెంట్లను చూసి వచ్చేలోపు ఆటోను దొంగిలించారు. ఆటోను అన్నమయ్య జిల్లా రామాపురం మండలం దూదేకుల పల్లికి చెందిన బాలగిరి మహమ్మద్ రఫీ చోరీ చేసినట్లు గుర్తించారు. కడప కేంద్ర కారాగారం వద్ద మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేశారు.